ప్రజాశక్తి
శుక్రవారం 15 నవంబరు, 2024



టెక్కలి డిఎస్‌పిగా మూర్తి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి డిఎస్‌పిగా డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్. మూర్తిని నియమిస్తూ... గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూర్తి ఇప్పటి వరకు ఎసిబి డిఎస్‌పిగా పనిచేస్తూ... ఇక్కడకు బదిలీపై వచ్చారు. మూడు నెలల అనంతరం టెక్కలికి నూతన డిఎస్‌పిగా నియమితులయ్యారు. టెక్కలి పోలీస్ సబ్ డివిజనల్ కార్యాలయం పరిధిలో 13 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఈయన గతంలో జిల్లాలో పలు స్టేషన్లలో ఎస్‌ఐగా, సిఐగా పనిచేశారు. ఈ మేరకు పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.


మూర్తి, డిఎస్‌పి

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

- స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి
- వైసిపి బాటలోనే కూటమి ప్రభుత్వం
- 'ప్రజాపోరు' విజయవంతం



శ్రీకాకుళం అర్బన్ : ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ప్రజాపోరులో భాగంగా నగరంలోని అంబేద్కర్ విగ్రహం కూడలి వద్ద ఆందోళన చేశారు. ముందుగా కూడలి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు, అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నష్టదాయకంగా ఉన్న విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతుల, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు అమర్చే కార్యక్రమం నిర్వహిస్తారని అన్నారు. నివాస గృహాలకు, వ్యవసాయ పంపు సెట్లకు ఈ మీటర్లు అమర్చడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉన్న సమయంలో టిడిపి, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించి మీటర్లు పగలగొట్టాలని పిలుపు నిచ్చారని గుర్తుచేశారు. అదాని, షిర్డీ సాయి సంస్థలతో కుమ్మక్కయ్యి, రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడి ఒప్పందాలు చేసుకొని మీటర్లు పెడుతున్నారని ఆరోపించిన చంద్రబాబు మాట తప్పి అదే ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రతి కనెక్షన్‌కు స్మార్ట్ మీటరు అమర్చడం నమ్మకద్రోహమని ఆరోపించారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై భారం పెరుగుతుందన్నారు. సకాలంలో చేతిలో డబ్బులు లేని పేదలకు చీకట్లు మిగులుస్తారా? అని ప్రశ్నించారు. మరో వైపు మీటరు కోసం 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో రూ.వేలు వినియోగదారులే చెల్లించాల్సి వస్తుందన్నారు. విద్యుత్ వాడకాన్ని బట్టి రాత్రి వేళల్లో అధిక రేట్లు విధించడం అదనపు బారమవుతుందన్నారు. ప్రజలపై భారాలు మోపి విద్యుత్ ఉత్పత్తిదారులకు దోచిపెట్టేందుకు ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. ఇప్పటికే రూ.17 వేల కోట్ల ట్రూ అఫ్ ఛార్జీల భారం వేస్తున్నారు. ఉచిత ఇసుక విధానాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు నియంత్రించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే జమిలి ఎన్నికల ప్రతిపాదనను విరమించాలన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఈ ప్రజాపోరులో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, పి.తేజేశ్వరరావు, జి.సింహాచలం, నాయకులు సిహెచ్.అమ్మన్నాయుడు, పోలాకి ప్రసాదరావు, ఆర్.ప్రకాష్, కొత్తకోట అప్పారావు, జి.ఈశ్వరమ్మ, ఎ.లక్ష్మి, అల్లు సత్యనారాయణ, యలమల రమణ పొందూరు చంద్రరావు, మాతల గోపి పాల్గొన్నారు.

రణస్థలం: విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు సిహెచ్.అమ్మన్నాయుడు, వెలమల రమణ డిమాండ్ చేశారు. ప్రజాపోరులో భాగంగా రామతీర్థం కూడలి వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : రైతుల, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సిపిఎం జిల్లా నాయకులు సిర్ల ప్రసాద్ కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రజాపోరులో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు. నిమ్మక అప్పన్న రమేష్ దుర్గారావు, కృష్ణ, రామారావు పాల్గొన్నారు.

సోంపేట: విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సంగారు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ప్రజాపోరులో భాగంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దున్న యామాయ్య, డి.కృష్ణారావు, కె.సింహాచలం, టి.రామారావు, ఎన్.ముకళింగం, డి.యోగేష్, కొరయ్య పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీలు రద్దు చేయాలని ప్రజాపోరులో భాగంగా సిపిఎం నాయకులు డిటి మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ధరలు నియంత్రించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడిచే జెమిలి ఎన్నికలు చట్టం అమలు చేస్తే ప్రజ్వామ్యానికి నష్టం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, నెయ్యాల మోహనరావు, భాస్కరరావు, సుగుణవతి పాల్గొన్నారు.

పలాస : విద్యుత్ ట్రూ అఫ్ ఛార్జీల పెంపును ఉపసంహరించాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సిపిఎం నాయకులు ఎన్.గణపతిరావు డిమాండ్ చేశారు. ప్రజాపోరులో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తికి వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.అజయ్‌కుమార్, డి.శ్రీనివాస్, ఎన్.ఢిల్లీశ్వరి, ఎం.నిర్మల, మనమ్మ, అప్పారావు పాల్గొన్నారు.



సోంపేట : ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు


వజ్రపుకొత్తూరు: వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు



కొత్తూరు : ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు



పలాస : వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆస్తి పన్ను శతశాతం వసూలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆస్తి పన్ను శతశాతం వసూలు చేయాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్లు, ఇతర సిబ్బందితో కలెక్టరేట్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలు ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను వెతకాలని స్పష్టం చేశారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాల పన్ను రూ.5.71 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. సక్రమంగా వసూలు చేయలేకపోతే సంబంధిత అధికారుల జీతాలను అటాచ్ చేస్తామని హెచ్చరించారు. మున్సిపాలిటీలు ప్రకటనల పన్నులను వసూలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి పన్ను వసూలు చేయడంలోనూ ఉదాసీనత పనికిరాదన్నారు. ఇచ్ఛాపురంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారికి గుడ్ విల్ కింద పన్నులు వసూలు చేయాలని చెప్పారు. పలాస-కాశీబుగ్గలో అందుబాటులో ఉన్న మున్సిపాలిటీకి చెందిన నాలుగు ఎకరాల ఖాళీ స్థలంలో పెద్ద షాపింగ్ కాంప్లెక్స్, కళ్యాణ మండపం నిర్మించడానికి ప్రతిపాదనలు రూపొందించాల న్నారు. నగరంలోని విజయాదిత్య పార్కులో ప్రకటనల కోసం పెద్ద పెద్ద హోర్డింగ్‌లను ఏర్పాటు చేసుకునేందుకు కార్పొరేట్ సంస్థలకు అవకాశం కల్పించాలని, వారి నుంచి లీజుతో పాటు ప్రకటనల పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. ఆదాయ మార్గాలు పెంచుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యమవు తుందన్నారు. మున్సిపల్ ఆస్తులను రక్షించుకోవడంతో పాటు ఖాళీ స్థలాల పన్నులను తప్పనిసరిగా వసూలు చేయాలన్నారు. ప్రతి ఇంటి నుంచీ చెత్త సేకరణలో కచ్చితత్వం పాటించాలన్నారు. చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలకు పంపించాలన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ నుంచి శ్రీకాకుళం డంపింగ్ యార్డుకు చెత్తను తరలించాలన్నారు. సమావేశంలో ఆయా మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మినీ అంగన్వాడీ కేంద్రాల స్థాయి పెంచాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీ మినీ సెంటర్ల స్థాయిని పెంచాలని అంగన్వాడీ వర్కర్ల అండ్ హెల్పర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి కోరారు. ఈ మేరకు ఈ నెల 16న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్బన్ ప్రాజెక్టు అధికారి స్వరాజ్యలక్ష్మిని గురువారం కలిసి ధర్నా నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అంగన్వాడీ మినీ వర్కర్లు అనేక సేవలందిస్తున్నారని అన్నారు. దీంతో అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తలకు పనిభారం పెరిగిందన్నారు. మినీ కేంద్రాల్లో సహాయకులు లేకపోవడం వల్ల కార్యకర్తలే అన్ని చూసుకోవాల్సి వస్తోందన్నారు. మినీ కేంద్రాల స్థాయి పెంచి ప్రధాన కేంద్రాలుగా మార్చాలన్నారు. అక్కడా సహాయకులను నియమించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కళ్యాణి

స్కౌట్స్, గౌడ్స్ సేవలు ప్రశంసనీయం


ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కోటబొమ్మాలి కొత్తమ్మతల్లి అమ్మవారి ఉత్సవాల్లో పోలీసు సిబ్బందితో పాటు స్వచ్ఛందంగా సేవలు అందించిన హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గౌడ్స్ సేవలు ప్రశంసానీయమని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహించిన కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి అమ్మవారి ఉత్సవాల్లో హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గౌడ్స్ సభ్యులు సామాన్య యాత్రికుల దర్శనానికి ఎటువంటి ఆటంకం లేకుండా క్యూ లైన్లు క్రమ పద్ధతులు నిర్వహణ, పోలీస్ సిబ్బంది, బందోబస్తులో స్వచ్ఛందంగా సేవలు అందించి, పోలీస్ సిబ్బందికి ప్రత్యక్షంగా సహాయ సహకారాలు అందించారని అన్నారు. గురువారం హిందుస్థాన్ స్కౌట్ అండ్ గౌడ్స్ సిబ్బందిని ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లాలో అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా ఉత్సవాల సమయంలో పోలీసు వారికి సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని కొనియాడారు. జిల్లాలో నిర్వహించనున్న అరసవల్లి, శ్రీముఖలింగం బందోబస్తుల్లో స్వచ్ఛందంగా సేవలను అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ ఇమాన్యువల్‌రాజు, హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గౌడ్స్ జిల్లా ఆర్గనైజర్ కమిషనర్ కే నాగేంద్ర, జిల్లా కమిషనర్ ఎం.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రం అందజేత

జిల్లాలోని కవిటి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గతేడాదిలో అనారోగ్యంతో మృతి చెందిన డి.భాస్కరరావు కుమారుడు సాయిరాముకి కారుణ్య నియామకం ప్రకారం విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పిస్తూ... నియామకపత్రాన్ని గురువారం ఎస్‌పి అందజేశారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవవచ్చునని సూచించారు. ఉద్యోగంతో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీస్ కార్యాలయం ఎఒ సిహెచ్.గోపీనాథ్, ఎస్‌పి సిసి బి.వి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

26న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 26న కలెక్టర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని అఖిలపక్ష కార్మిక, సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల నాయకులు పిలుపునిచ్చాయి. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సంఘాల ఉమ్మడి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సంకీర్ణ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను కొనసాగిస్తూ మోడీ తత్వాన్ని రుజువు చేసుకుందని విమర్శించారు. ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న టిడిపి, జనసేన ప్రభుత్వ మోడీ విధానాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో నిరసన చేపడుతున్నట్లు చెప్పారు. సంపదలు సృష్టించేది కార్మికవర్గమని, ప్రజలకు తిండిపెట్టే రైతాంగాన్ని విస్మరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు అనుకూలంగా నడుచుకుంటున్నాయని అన్నారు. గడచిన పదేళ్ల బిజెపి పాలనలో కార్పొరేట్లకు రూ.19.28 లక్షల కోట్లు రుణమాఫీ, పన్ను రాయితీ, ప్రోత్సాహాల పేరుతో ప్రజాధనాన్ని దోచిపెట్టిందని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌తో సహా భారీ పరిశ్రమలు, గనులు, సముద్రతీరాన్ని కారుచౌకగా కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం కట్టబెడుతుందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నీ ప్రయివేటుకు విక్రయించడం లేదా? మూసివేసే విధానాన్ని మోడీ అమలు చేస్తున్నారన్నారు. ఈ ఏడాది బడ్జెట్లో 500 ప్రయివేటు కంపెనీలకు యాజమాన్యం చెల్లించాల్సి జీతాలు కేంద్ర ప్రభుత్వమే ఇంటర్న్ షిప్ పేరుతో కార్మికుడికి నెలకు రూ.5 వేలు ఇస్తున్నారన్నారు. కార్మికులకు నెలకు రూ.26 వేల కనీసవేతనాన్ని ఇవ్వకుండా గడచిన పదేళ్లుగా ఇదే విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. సుప్రీం కోర్టు చెప్పినా స్కీమ్ కార్మికులు అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులను కార్మికులుగా గుర్తించడంలేదన్నారు. వారు ఉద్యమిస్తారన్న కారణంతో 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చేశారన్నారు. ఉపాధి పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడిచి ఈ ఏడాది రూ.6 కోట్ల మంది లబ్ధిదారులను తగ్గించిందన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి కార్మికవర్గాన్ని చీల్చాలని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నిరంతరం ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. సమావేశానికి సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ తాండ్ర ప్రకాష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఎపి కౌలు రైతులు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు, ఎన్.నీలంరాజు, ఎం.యుగంధర్, ఎపి రైతు సంఘం జిల్లా కన్వీనర్ చాపర వేణుగోపాల్, అఖిల భారత రైతు, వ్యవసాయ కూలీ సంఘం జిల్లా బాధ్యులు జి.సురేష్‌కుమార్, ఎస్ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మోహనరావు

ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కృషి

- ఆర్గానిక్ ఉత్పత్తులపై అవగాహన కల్పించాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రకృతి వ్యవసాయం జిల్లాలో మరింత విస్తరింపచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లాలో పంటల సాగు, ఉత్పత్తుల విస్తీర్ణం, ఆదాయం మరింత పెరగాలని సూచించారు. కలెక్టరేట్‌లో ప్రకృతి సాగుపై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకాలకు ధ్రువపత్రం అవసరమని అన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన అవసరమని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపేలా అవగాహన కల్పించాలన్నారు. తద్వారా రైతులకు, ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. బెజ్జిపురం యూత్ క్లబ్ వ్యవస్థాపకులు ఎం.ప్రసాదరావు, సిఎవిఎస్ స్వచ్ఛంద సంస్థ పగడాల భూదేవి, స్వేప్ స్వచ్ఛంద సంస్థ రమణమూర్తి, ఆర్ఫ్ సంస్థ ప్రతినిధి సన్యాసిరావు, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొని ప్రకృతి సాగు, మార్కెటింగ్‌పై పలు అంశాలను అంశాలను వివరించారు. జిల్లా కేంద్రంలో హబ్ ఏర్పాటు చేసి మార్కెటింగ్‌కి మరింత మెరుగుపరచాలని కోరారు. రైతులను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకానికి మున్సిపాలిటీ పరిధిలో విక్రయ కేంద్రాల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. మెప్మా మార్ట్‌లో ఆర్గానిక్ ఉత్పత్తుల విక్రయానికి అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వరప్రసాద్, జిల్లా వ్యవసాయ. అధికారి త్రినాథ స్వామి, మార్కెటింగ్ సహాయ సంచాలకులు బి.రవికుమార్, జిల్లాలో ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులు, మార్కెటింగ్ చేస్తున్న వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నేటి బాలలే రేపటి పౌరులు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నేటి బాలలే రేపటి పౌరులని, అటువంటి బాలలకు ఉజ్వల భవిష్యత్ అందించే బాధ్యత ప్రతి ఒక్కరిదీ అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక అరసవిల్లిలోని చిల్డ్రన్స్ హోమ్‌లో జిల్లా బాలల రక్షణ విభాగం (మిషన్ వాత్సల్య), మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఏర్పాటు చేసిన బాలల దినోత్సవ వేడుకలుకలు, బాలల హక్కుల వారోత్సవాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళ్లర్పించారు. అనంతరం బాలలకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలలంతా పాఠశాలల్లోనే ఉండాలి, వారి హక్కులను పరిరక్షించాలని అన్నారు. హేండ్ వాష్ సక్రమంగా చేసుకోవాలన్నారు. హేండ్ వాష్ చేసే విధానం పిల్లలు చేసి చూపించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో బాలలు ఎదిగే అవకాశాలు కల్పించాలన్నారు. బాలల హక్కులు పరిరక్షిస్తూ వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. బడిఈడు పిల్లలు బడి వెలుపల ఉండరాదన్నారు. కార్యక్రమం అనంతరం ప్రత్యేక దత్తత సంస్థ (శిశుగృహాన్ని)ను సందర్శించారు. చిల్డ్రన్ హోమ్, శిశు గృహాల్లో మౌలిక సదుపాయల కల్పనకు ఇంజినీరింగ్ విభాగం ద్వారా అంచనాలను తయారు చేసి ప్రతిపాదనలు పంపిన వెంటనే మంజూరు చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా శిశుసంక్షేమశాఖ పీడీ బి.శాంతిశ్రీ, డిసిపిఒ కె.వి.రమణ, సూపరింటెండెంట్ పుణ్యవతి, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

'జన జాతీయ గౌరవ దివస్'కు సర్వం సిద్ధం

సీతంపేట ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఈ నెల 15న గిరిజన స్వాతంత్ర సమరయోధుడు బిర్సాముండా జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జన జాతీయ గౌరవ దివస్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మెళియాపుట్టి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించనున్న ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. జిసిసి, విడివికె, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, పర్యాటకశాఖ వంటి స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. గిరిజన సంస్కృతిక, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధానమంత్రి వర్చువల్‌గా మాట్లాడే అవకాశం ఉందని, అందుకు సంబంధించిన నెట్‌వర్క్ ఏర్పాట్లు చేసినట్లు పిఒ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 135 మంది ఆర్ఒఎఫ్ఆర్ లబ్ధిదారులకు అటవీ పట్టాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు, కలెక్టర్, జిల్లా అధికారులు, గిరిజన సంఘ నాయకులు పాల్గొంటారని చెప్పారు. వాహనాల పార్కింగ్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, డిఆర్‌డిఎ పీడీ పిడి కిరణ్ కుమార్, గృహ నిర్మాణశాఖ పీడీ నగేష్, గిరిజన సంక్షేమశాఖ ఇఇ రమాదేవి, ఐటిడిఎ డిడి అన్నదొర, పిహెచ్ఒ గణేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ, గిరిజన సంక్షేమ శాఖ డిఇ సిమ్మన్న, ఎఇ శ్రీకాంత్, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, తహశీల్దార్ బడే పాపారావు తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు ఇస్తున్న పిఒ యశ్వంత్ కుమార్‌రెడ్డి

సహకార రంగంతో ప్రయోజనాలెన్నో...

జెసి ఫర్మాన్ అహ్మద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సహకార రంగం వల్ల ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు అందుతున్నాయని, ప్రధానంగా చిన్న, సన్నకారు రైతాంగానికి మేలు చేకూరుతుందని జెసి ఫర్మాన్ అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయంలో గురువారం నిర్వ హించిన 71వ జాతీయ సహకార వారోత్సవాలను ప్రారంభించారు. ముందుగా కార్యాలయం ఆవరణ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిం చారు. అనంతరం మాట్లాడుతూ సహకార వ్యవస్థ ఎంత విజయవంతంగా ప్రజలకు సేవలు అందిస్తోందన్నారు. సంఘాలు బలోపేతం కావడానికి వీలుగా పూర్తి స్థాయిలో కంప్యూటరైజేషన్ చేపట్టి ప్రాథమిక గ్రామస్థాయిలోని సంఘాల నుంచి దేశం మొత్తం మీద ఆన్‌లైన్ విధానం అనుసంధానం కానుందన్నారు. అందుకోసం ఒకే జాతీయ సాఫ్ట్‌వేర్ నెట్‌వర్కును కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. దీనివల్ల సంఘాలు మరింత పారదర్శకంగా పనిచేస్తాయన్నారు. నాబార్డుతో అనుసంధానించడం ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతోందన్నారు. రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ధాన్యం నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగిన గోదాములు అందుబాటులోకి రానున్నా యన్నారు. జిల్లాలో ఆదిశగా అడుగులు వేయాల్సి ఉందన్నారు. జిల్లా సహకార అధికారి బి.నగేష్ మాట్లాడుతూ 'వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర' ఎంతో కీలకమన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల బ్రాంచ్‌ల్లో, పట్టణ సహకార బ్యాంకుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, పరపతేతర సంఘాల్లో ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సహకారోద్యమమంపై సభ్యులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డిసిసిబి సిఇఒ డి.వరప్రసాద్, నాబార్డు డిడిఎం కె.రమేష్‌కృష్ణ, బ్యాంకు జిఎం ఎస్.ఎస్.జగదీష్, శ్రీకాకుళం డివిజనల్ సహకార అధికారి బి.మురళీకృష్ణ, టెక్కలి డివిజనల్ సహకార అధికారి కె.మురళీకృష్ణమూర్తి పాల్గొన్నారు.



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్



పరిశీలిస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

'అపార్' నమోదు వేగవంతం

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అపార్ ఐడి అవసరమని, వాటిని ఆధార్ అనుసంధానం చేసి అపార్ ఐడి త్వరతగతిన పూర్తి చేయాలని ఆర్‌డిఒ వెంకటేష్ ఆదేశించారు. కాశీబుగ్గ బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలోని అపార్ నమోదు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో వివిధ పాఠశాలల్లో, కళాశాలల్లో 2,2027 విద్యార్థులు ఉండగా, ఇప్పటి వరకు 17,248 విద్యార్థులు అపార్ ఐడి నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన విద్యార్థులూ ఐడిలను త్వరతగతిన పూర్తి చేసి ఈ ప్రక్రియకు ముగింపు పలకాలని సూచించారు. ఆయనతో పాటు ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు, ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నికైంది. మండల అధ్యక్షునిగా టి. జయరాం, కార్యదర్శిగా సిద్ధు, కోశాధికారి కె.గోపి, గౌరవాధ్యక్షునిగా లఖినాన ఢిల్లీశ్వరరావు, సహాధ్యక్షులు ఎం.సంతోష్‌కుమార్, బి. రామతులసి, ఆడిట్ కమిటీ కన్వీనర్ డి.శరత్‌బాబు, సభ్యులు కె.రమేష్, బిజూ పాణిగ్రహి, మండల కార్యదర్శులుగా ఎస్.వి.పట్నాయక్, పి.చందు, టి.తిరుపతి, ఆర్.కృష్ణారావు, జి.శ్రీనిబాబు, పి.నాగేశ్వరరావు, బి.వరప్రసాద్, టి.మోహన్, కె.పాపారావు, ఆర్.సోమేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్లుగా డి.జనార్ధనరావు, టి.అప్పారావు, జి.నాగేశ్వరరావు, కె.రమేష్, ఎస్.వి.రమణ, కె.రవీంద్ర, డి.లక్ష్మణరావు, జి జగదీశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా జి.కోదండరావు వ్యవహరించారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు.

ఎమ్మెల్యే శిరీషకు ధన్యవాదాలు

ప్రజాశక్తి- పలాస



రాంబాబు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మొట మెదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టి అసెంబ్లీలో ఎమ్మెల్యే గౌతు శిరీష గిరిజనులు పడుతున్న కష్టాలను ప్రస్తావించడం చూస్తుంటే గిరిజనులపై ఆమెకు ఉన్న అభిమానం అద్ద పడుతుందని, గిరిజనుల బాధలను గుర్తించిన శిరీషకు గిరిజనుల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని మాజీ కౌన్సిలర్ సవర రాంబాబు ఒక ప్రకటనలో అన్నారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ఏ ఒక్కరోజూ గిరిజనుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. సబ్ ప్లాన్ నిధులు, కార్పొరేషన్ నిధులు, ట్రైకార్ నిధులు దుర్వినియోగమయ్యాయని విమర్శించారు. జిల్లాలో ఐటిడిఎ లేకుండా చేశారన్నారు. అప్పట్లో మంత్రిగా ఉన్న అప్పలరాజు కూడా గిరిజనుల కోసం ఏ నాడు పట్టించుకోలేదన్నారు.



నందిగాం : వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

'108'ను ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రజాశకి- పలాస

108 వాహనాలతో పాటు సిబ్బందిని నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని 108 యూనియన్ నాయకులు సత్యం, గోపి, సురేష్, తారక్, వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ నెల 25 నుంచి 108 సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిటి లోఋనారాయణకు, ఎంపిడిఒ వసంతకుమార్‌లకు గురువారం వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతన స్లాట్స్ అప్‌డేట్ చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా వేతన స్లాట్స్ అప్‌డేట్ చేయలేదన్నారు. ఏటా ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్స్, వాటి ఎరియర్స్, ఇఎల్ డబ్బులను అరబిందో సంస్థ నాలుగేళ్లుగా ఇవ్వలేదని, తక్షణమే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం చేస్తున్న 12 గంటల పనివిధానం రద్దు చేసి 8 గంటల పని విధానం అమలు చేయాలని కోరారు. చెందిన పిఎఫ్ డబ్బులు, యాజమాన్య వాటా ఉద్యోగులు దగ్గర నుంచి కట్ చేస్తున్నారని, దానిని యాజమాన్యం నుంచే వసూలు చేయాలని డిమాండ్ చేశారు.

నందిగాం : తహశీల్దార్ పి.సోమేశ్వరరావుకు 108 ఉద్యోగులు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది బి.రాము, తారకేశ్వరరావు, బి.రాజేష్, ఎన్.వి.రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుమలరావు

ఆరుతడి పంటలతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రబీ సీజన్‌లో ఆరుతడి పంటలతో రైతులకు అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ ఎడి బి.వి.తిరుమలరావు అన్నారు. వ్యవసాయ ల్యాబ్ కార్యాలయంలో ఐదు మండలాల అధికారులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీలో అపరాలు వేరుశనగ పంటలు పండిస్తే రైతులకు అధిక లాభం వస్తుందన్నారు. రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మొక్కజొన్న, కట్టిజనుము సాగుపై వివరించారు. ఆముదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ అనూష, రాజశేఖర్, ఉద్యానవన అధికారి సునీత, ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఒ రంగారావు, జనార్ధనరావు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలను అందజేస్తున్న కిరణ్‌కుమార్

టెక్కలి: జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ స్థానిక ఎన్‌టిఆర్ నగర్‌లో ఉన్న పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలను అరోధించా లన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, తుంబల కొటయ్య, త్రివేణి, భాస్కర్, నరేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



ఎచ్చెర్ల : నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఆచారి



ఆమదాలవలస : నివాళ్లర్పిస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రంథాలయాలు పుస్తక బాండాగారాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ కె సురేఖ, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె. సూర్యచంద్రరావులు అన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను వారు ప్రారంభించారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఎగుర వేసి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజులు మాట్లాడారు. వారంరోజుల పాటు నిర్వహించే ఈవారోత్సవాల్లో గ్రంథాలయాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియ జేసేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వివిజిఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పివి భాస్కరరాజు, చోడవరం ఈశ్వరరావు, ప్రత్యూష, రాంబాబు, వరలక్ష్మి, కళ్యాణి, రామ్మోహన్, భానుమతి, మురళి కృష్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: విజ్ఞాన సంపదను అందించే గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని బొడ్డేపల్లి పేటలో ఉన్న శాఖా గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొడ్డేపల్లి లక్ష్మణరావు, విశ్రాంత హెచ్ఎం పాతిన వరాహ నరసింహం, అధ్యాపకులు తమ్మినేని సూర్యారావు, అంపోలు సూర్యనారాయణ, బొడ్డేపల్లి సూర్యనారాయణ, గ్రంథాలయాధికారి అన్నెపు కోటేశ్వరరావు, సహాయకులు జయలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ధర్మవరం గ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో 'మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ' ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సంస్థ అధ్యక్షులు టేకి ఆచారి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.హరికృష్ణతో పాటు అధ్యాపక సిబ్బంది, సంస్థ సభ్యులు బి.నాగేశ్వరావు, కె.ప్రకాష్, ఎ.శశి, డి.శంకర్, వై.నందేశ్వరావు, బి.సత్యనారాయణ, పి.మధు, బి.సూర్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు: లావేరు శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. తొలిత బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి హైస్కూల్ హెచ్ఎం పసుపుల జగన్నాథం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, తెలుగు పండితులు నాగరాజు, గ్రంథాలయ సహాయకులు టి. వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూర్జ: స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ఎంఇఒ ధనుంజయరావు ప్రారంభించారు. ముందుగా నెహ్రూ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.సునీత, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయాధికారి సిహెచ్.వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. యంగ్‌స్టార్ యూత్ క్లబ్ సభ్యులు యు.రాజు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు: విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని ఎంపిడిఒ నీరజ అన్నారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, గ్రంథాలయాధికారి టి.ఇందిర, విజ్ఞాన భారతి ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, మండల పరిషత్ ప్రధానోపాధ్యాయులు డి.ప్రసాదరావు, ఉపాధ్యాయులు ఎల్.కిరణ్‌కుమార్, అప్పలనాయుడు, లక్ష్మి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాతపట్నం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో చిన్నపిల్లల వైద్యులు, సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ జి.వేణుగోపాలరావు జాతీయ పతాకావిష్కరణ గావించారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి విశ్రాంత ఎంఇఒ పతివాడ దాసునాయుడు, విశ్రాంత ఉపాధ్యాయులు రేగేటి ఆనందరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది మెట్ట రామారావు, గ్రంథాలయ అధికారి కాళ్ల రాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.చక్రపతి, వ్యాపారవేత్త శైలాడ సతీష్, ఐటిడిఎ సీనియర్ అసిస్టెంట్ ఇప్పిలి రవి, జూనియర్ లెక్చర్లు పాల్గొన్నారు.

నందిగాం: విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని నందిగాం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎరనగుల హరిబాబు పిలుపునిచ్చారు. స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సత్తారు ఉదయ్‌కిరణ్, ఎంపిపి స్కూల్ హెచ్ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేఖ



లావేరు : మాట్లాడుతున్న హెచ్ఎం జగన్నాథం

ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వ గ్రంథాలయంలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవంలో తహశీల్దార్ వెంకటరావు, గౌరీశంకర్‌రెడ్డి, అధ్యాపకులు సంకరరావు, ఆర్ఐ కృష్ణారావు, గ్రంథాలయాధికారి పాల్గొన్నారు. అనంతరం అనంతరం తహశీల్దార్ పుస్తకాల కోసం రూ.2 వేలు ఆర్థికసాయం అందజేశారు.

టెక్కలి : స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన జాతీయ గ్రంథాయ వారోత్సవాలను తహశీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.రూపావతి, గ్రంథాలయ విశ్రాంత అధికారులు తమిరి వైకుంఠరావు, గున్న ప్రసాదరావు, ఉపాధ్యాయులు రమేష్, త్రివేణి పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, ఆర్.రామారావు, కందిగొళ్ల పాల్గొన్నారు.

పలాస : గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని ఎంపిడిఒ వసంతకుమార్ అన్నారు. కాశీబుగ్గ శాఖాగ్రంథాలయంలో నెహ్రూ జయంతి వేడుకలు, బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒలు సిహెచ్. శ్రీనివాసరావు, సత్యం, గ్రంథాలయాధికారి రాంబాబు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

దేవాదాయ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నంలోని నీలమణి దుర్గ అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని గురువారం సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఏటా నిర్వహించే వార్షికోత్సవాలను, ఏడేళ్లకోసారి నిర్వహించే అమ్మవారి పెద్ద పండగలను ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహించాలని అభ్యర్థించారు.



శిబిరంలో వైద్యసేవలందిస్తున్న పిఎంపిలు

150 మందికి సుగర్ వైద్య పరీక్షలు

శ్రీకాకుళం అర్బన్: స్థానిక పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి మందిరం న్యూకాలనీలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 150 మందికి సుగరు, బిపి, థైరాయిడ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య సాయి మందిరం కన్వీనర్ జయరామ్ మాట్లాడుతూ పిఎంపి సంఘ సభ్యులు ఇంత మంచి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వండాన శిమ్మన్న, జిల్లా కార్యదర్శి నక్క లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీ చిన్నాల రాము, ఇసి మెంబర్ కింజరాపు రాజారావు, సీనియర్ మెంబర్స్ మంగరాజు లవుడు, మడ్డి అప్పలరాజు, డోల వాసు, ఆర్.నవీన్ రాజు, ఆర్.తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు పోలాకి మండల సమావేశం

పోలాకి : ఈ నెల 16న పోలాకి మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ముద్దాడ దమయంతి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకావాలన్నారు.

క్రీడలతో విద్యార్థులకు గుర్తింపు

వజ్రపుకొత్తూరు: క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు మంచి గుర్తింపు లభిస్తుందని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.హరిబాబు అన్నారు. విద్యార్థులు సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. వృత్యంతర శిక్షణ కార్యక్రమాల్లో ప్రతి విద్యార్థీ పాల్గొనాలని సూచించారు. ఇటీవల బాపట్లలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 కబడ్డీ విభాగంలో 9వ తరగతి విద్యార్థి దట్టి కళ్యాణ్ బంగారు పతకం సాధించాడు. గురువారం వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్.నాగరాజును హెచ్ఎం ఉపాధ్యాయులు, జి.లక్ష్మణరావు, సీతమ్మ, సత్యరాజు, ఉమారావు, ఉమామహేశ్వరి, రషీద్, రాజశేఖర్ అభినందనలు తెలిపారు.

17న జిల్లా కళాసీ కార్మిక సంఘం మహాసభ

పోస్టరును ఆవిష్కరించిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

జిల్లా వ్యాప్తంగా వివిధ సంస్థల్లో పని చేస్తున్న కళాసీ కార్మికుల హక్కుల పరిరక్షణలో భాగంగా ఈనెల 17న జిల్లా కళాసీ కార్మిక సంఘం 5వ మహాసభలు నిర్వహిస్తున్నట్టు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, కళాసీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిన్నారావు, కె.సూరయ్య తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని ఇందిరానగర్‌లో గల సిఐటియు కార్యాలయంలో జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం డైమండ్ పార్క్ నుంచి ఏడురోడ్ల కూడలి మీదుగా పాత బస్టాండ్ వరకు కార్మికుల ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం టౌన్ హాల్ సమీపాన గల శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో మహాసభలు ప్రారంభం కానున్నట్టు తెలిపారు. మహాసభల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తారని తెలిపారు. జట్టు, ముఠా కళాసీ కార్మికులు అత్యంత దుర్భర పరిస్థితుల్లో బతుకీడుస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ 55 కేజీల బరువులకు మించి మోయరాదని తీర్మానం చేసిందని, భారత ప్రభుత్వం ఆమోదించినా నేటికీ అమలు కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అసంఘటితరంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాత్సారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉన్న చట్టాలను తుంగలో తొక్కిందని, కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని దుయ్యబట్టారు. జట్టు, ముఠా కళాసీలకు సమగ్రచట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా, పి.ఎఫ్, ఇఎస్ఐ చట్టం వర్తింపజేయాలని కోరారు. హమాళి, జట్టు, ముఠా కళాసీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలని, గుర్తింపు కార్డులు, పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎన్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేలబొంతు ఆశ్రమ పాఠశాల సందర్శన



టెక్కలి : ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పిఒ

ప్రజాశక్తి- మెళియాపుటి

పాఠశాలల్లోని మరుగుదొడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మండలంలోని నేలబొంతు బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన సాగించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల...

టెక్కలి : మండలంలోని భీంపురం ఆశ్రమ పాఠశాలని సీతంపేట ఐటిడిఎ పిఒ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థమయ్యే రీతిలో బోధన ఉండాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించలన్నారు. ఈయనతో పాటు ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

'పోసాని'పై చర్యలు తీసుకోవాలి

టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటరమణ

ప్రజాశక్తి- పాతపట్నం

సినీ నటుడు, వైసిపి నాయకులు పోసాని కృష్ణమురళిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ కోరారు. ఈ మేరకు పాతపట్నం సిఐ వి.రామరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమురళి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపైన, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పైన, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పైన, టిటిడి చైర్మన్‌గా బి.ఆర్.నాయుడుపైన, ఈనాడు సంస్థల అధినేత కీర్తిశేషులు రామోజీరావు పైన, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణతో పాటు వారి కుటుంబ సభ్యులపై నీచమైన భాషలో దుర్భాలసులడుతూ అసభ్య పదజాలాలు, అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. అందుకు ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు టిడిపి మండల అధ్యఓఉలు పైల లక్ష్మయ్య, మిరప బెల్లి బాబూరావు, నాయకులు ఉన్నారు.



పాతపట్నం : ఫిర్యాదు చేస్తున్న వెంకటరమణ

టెక్కలి : సినీ నటుడు, వైసిపి నాయకులు పోసాని కృష్ణమురళిపై చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు కోళ్ల లవకుమార్ టెక్కలి సిఐ విజయకుమార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కొళ్ల లవకుమార్, కొళ్ల కామేష్, పోలాకి చంద్రశేఖర్ (కింగ్), కోరాడ రామప్రసాద్, దళిత సంఘ నాయకులు యడ్ల గోపి పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడాలి



శ్రీకాకుళం అర్బన్ : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బాలల హక్కులను కాపాడడంలో తల్లిదండ్రులతో పాటు అధికారులు, సమాజం, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాల్సిన అవసరముందని వక్తలు పేర్కొన్నారు. స్వీప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కొమ్ము రమణమూర్తి ఆధ్వర్యంలో జిల్లా చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ పర్యవేక్షణలో బాలల హక్కుల వారోత్సవాలు పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు 14 నుంచి వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. బాలలహక్కులను కాపాడుతూ సమాజ ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో విద్యావేత్తలు సురంగి మోహనరావు, వావిలపల్లి జగన్నాథంనాయుడు, హారికాప్రసాద్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, జామి భీమశంకర్, పైడి హరనాధరావు, టెక్కం రాంగోపాల్, గుత్తు చిన్నారావు, తర్లాడ అప్పలనాయుడు, పందిరి అప్పారావు, కె.ఆర్.నాయుడు, మహిబుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: ప్రాథమిక స్థాయినుంచే చిన్నారులు తమకు గల హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల-1లో గురువారం స్థానిక జ్యుడిషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు గల హక్కులను, చట్టాలను తెలియజేశారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.విజయ్‌కుమార్, న్యాయవాదులు బ్రహ్మాజీ, రాము తదితరులు పాల్గొన్నారు.



పొందూరు : విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేస్తున్న జడ్జి జ్యోత్స్న

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

నందిగాం: మండలంలోని మద్దిలోడిపేట వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై గురువారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిలేటిపేటకు చెందిన కోళ్ల రాజులమ్మ (68) టెక్కలి వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్లారు. పనులు ముగించుకుని బస్సు దిగి ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుంది. ఈ సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాద స్థలంలోనే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిఐ బేబి

ఎంఆర్‌పికే విక్రయించాలి

సోంపేట: షాపుల్లో మద్యం ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని ఎక్సైజ్ సిఐ బేబి ఆదేశించారు. స్థానిక స్టేషన్‌లో మద్యం షాపుల సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి షాపు వద్దా ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. పని వేళలు పాటించాలని సూచించారు. షాపు నుంచి మద్యాన్ని అక్రమంగా తరలించినట్లయితే చర్యలు తప్పవన్నారు. ఇటీవల పలాస పరిధిలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా నాటుసారా తరలిస్తున్న కె.వినోద్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. నాటుసారా అక్రమ తయారీ, రవాణాపై సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

17న జాబ్‌మేళా

రణస్థలం: మండల కేంద్రంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ఈ నెల 17న ఫైజర్ హెల్త్ కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మహిళా అభ్యర్థులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మీసాల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో 50 శాతం పాసైన సైన్స్ గ్రూపుల అభ్యర్థులు, మొదటి సంవత్సరం డిగ్రీ చదువుతున్న అభ్యర్థులు 2023 - 24 తొలి ప్రయత్నంలో పాసైన అభ్యర్థులకు అవకాశం కల్పించబడునని తెలిపారు. 18 నుంచి 20 ఏళ్లలోపు విద్యార్థినులకు అవకాశాలు కల్పించ బడినని, జీతం రూ.13,500తో పాటు వసతి, భోజన సౌకర్యం, రవాణా సౌకర్యం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 8919182007, 9347055910 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఎచ్చెర్ల : స్పెషల్ బిఇడి కోర్సులోని మిగులు సీట్లుకు ప్రవేశాలను డా.బి.ఆర్.అంబేద్కర్ యూనివర్శిటీ నిర్వహించనున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.అనురాధ తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సోమవారంలోగా వర్శిటీలోని విద్యా విభాగం కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎడ్‌సెట్-2024లో ర్యాంకు పొందిన వారు మాత్రమే ఈ కోర్సులో చేరేందుకు అర్హులని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి, ర్యాంకులో వచ్చిన మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించబడునని ప్రిన్సిపాల్ తెలియ జేశారు. విద్యార్హతలు, కుల ధ్రువీకరణ పత్రాలు, అభ్యర్థి ఆధార్‌కార్డు, ఫొటోలతో దరఖాస్తు చేసు కోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగం సమన్వయకర్త స్వామి నాయుడు 9110722311 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళం

ఇచ్ఛాపురం: మండలంలోని ఈదుపురంలో రామాలయ నిర్మాణానికి డాక్యుమెంట్ రైటర్ ఉప్పాడ సోమేశ్వరరావు దంపతులు రూ.75 వేలు విరాళం అందించారు. ఈ విరాళాన్ని గ్రామ పెద్దల సమక్షంలో ఆలయ నిర్మాణానికి తన వంతు విరాళంగా గురువారం అందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న సోమేశ్వరరావు

ఘనంగా బాలల దినోత్సవం


ఇచ్ఛాపురం : వివిధ వేషధారణలో చిన్నారులు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పలు ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో జాతీయ బాలల దినోత్సవం వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కెజిబివి పాఠశాలలో ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. స్థానిక భాష్యం స్కూల్‌లో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే మజ్జిలిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.

లావేరు: మండలంలోని బుడుమూరు జెడ్‌పి పాఠశాలలో హెచ్‌ఎం ఉరిటి శ్రీనువాసరావు నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక పర్యావరణ కమిటీ జిల్లా కన్వీనర్ పి.గోవిందరావు, ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాద్, ఎం.అనురాధ, వెంకటరావు, పెంటయ్య, రమేష్ బాబు, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : బాలల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం కె.ఎ.రాములు పేద విద్యార్థులకు, ఎఫ్ఎవన్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎంసి చైర్మన్ ప్రతినిధి సిహెచ్ నరేష్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, నగర కన్వీనర్ శ్రీదేవి పాణిగ్రహి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా నగరంలోని చల్లవీధిలో పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆండ్రాయిడ్ ఫోన్ల వినియోగం పెరిగిన తర్వాత పిల్లలు ఫోన్లుకు బానిసలవుతున్నారన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఆనపు లత, డోల లక్ష్మీ వ్యవహరించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భవాని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: విద్యార్థులు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉన్నతంగా రాణించాలని సైనూరు సర్పంచ్ అట్టాడ గోవిందరావు (గోపి) అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా పొల్లాడ పాఠశాలలో దాతలు మల్లా మధవరావు, కిశోర్ కుమార్, అజయ్ కుమార్ సహకారంతో విద్యార్థులకు రూ.20 వేలు విలువ చేసే కాపీ రైట్, అట్లాస్, నోట్ బుక్స్, టెన్స్ పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్పు రవికుమార్, జామి రాము, హెచ్‌ఎం అప్పారావు పాల్గొన్నారు.

కవిటి: బాలలదినోత్సవ వేడుకలు మండలంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త కొజ్జిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తల్లిదండ్రుల విలువ తెలియజేస్తూ విద్యార్థులతో తల్లి పాదాలను కడిగించారు. సందర్భంగా విశ్రాంత డిఎస్‌పి ఎస్.వి.వి.ప్రసాదరావు పాఠశాలకు కంప్యూటర్ వితరణగా ఇవ్వగా, ఎల్ఎఫ్.ఎల్ హెచ్‌ఎం బి.లక్ష్మణమూర్తి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. అనంతరం పాఠశాల సిబ్బంది ప్రసాదరావు, అమ్మా రామకృష్ణ, లక్ష్మణమూర్తిలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అదే విధంగా కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎంపిపి పాఠశాల, కుసుంపురం, కవిటి బివికె, ఎస్వీజె డిగ్రీ కళాశాల, కల్యాణి ఆంగ్ల పాఠశాల, ప్రగడ పుట్టుగ ఎంపియుపిలో పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.


కవిటి : విశ్రాంత డిస్‌పిని సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

ఇచ్ఛాపురం : స్థానిక జ్ఞానభారతి విద్యా సంస్థలో నిర్వహించిన బాలల దినోత్సవంలో కార్యదర్శి, సిఇఒ జోహార్‌ఖాన్, ఎంఇఒ కె.అప్పారావు, ఉపాధ్యాయులు ఆపల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల బాలలు వివిధ జాతీయ నాయకులు, సైనికులు, పోలీస్ అధికారులు, వైద్యులు, ఉపాధ్యాయులు, రైతులు తదితర వేషధారణలో అందరినీ అలరించారు. అలాగే విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలను రుచిచూశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్టు మేనేజర్ అలీమ్ ఖాన్, వీటి కైలాస్ పండా పాల్గొన్నారు.

'కొలిగాం'లో మీనా బజార్ ఏర్పాటు

మండలంలోని కొలిగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన మీనా బజార్ అందరినీ ఆకట్టుకుంది. ప్రధానోపాధ్యాయులు ఎం.నరేంద్రనాథ్ పట్నాయక్ ఆధ్వర్యాన గురువారం మీనా బజార్ ఏర్పాటు చేశారు. ఇందులో విద్యార్థులు తమకు నచ్చిన వంటకాలు తయారు చేశారు. గ్రూప్ వారిగా అన్ని తరగతులకు చెందిన విద్యార్థులు వివిధ స్టాల్స్ పెట్టు అమ్మకాలు చేపట్టారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు మిను, నిలిపి, జ్యోతి, పద్మావతి, రేణుక, చంద్రవన్, శ్రీనివాస్, స్వప్న పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయబాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఇటీవల జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి కబడ్డీ, ఖోఖో క్రీడల్లో రాణించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు కమిటీ చైర్మన్ బోయిన వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు డి. గోవిందరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

మందస : మండలంలోని హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్, హరిపురం ప్రధానోపాధ్యాయులు జి.ఉమారాజు అధ్యక్షతన బాలల దినోత్సవం నిర్వహించారు ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన గొరకల అనురాధ, వారణాసి సౌమ్య, ముంజేటి హార్థికలకు ఎరుకోల సోమేశ్వరరావు కుటుంబ సభ్యులు, శబరీశ్వరి హోమ్ షాపి, హరిపురం తరుపున విద్యావేత్త వై.కిషోర్‌కుమార్ నగదు ప్రోత్సాహక బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు.

పలాస : మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు చేశారు. అనంతరం చిన్నారులు వివిధ వేషధారణతో అలరించారు. కార్యక్రమంలో జిల్లా కళింగ కోమటి మహిళా అధ్యక్షులు మల్లా పద్మజ, జిల్లా పరిషత్ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఉపేంద్రనాథ్, ఇస్కాన్ మేనేజ్‌మెంట్ సభ్యులు రామకృష్ణ, ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి, శ్రీను, శరత్ పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు : విద్యా సామగ్రిని అందజేస్తున్న సర్పంచ్ గోవిందరావు

టెక్కలి : స్థానిక రవీంద్రభారతిలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన కళారూపాలు అలరించాయి. చిన్నారులు చేసిన నృత్యాలు ఆలోచింపజేశారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు పాఠశాల డీన్ నాగరాజు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ పాల్గొన్నారు.

అమ్మఒడి పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా పాఠశాల డైరెక్టర్ బరాటం శ్రీనివాసరావు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదరరావు, ఉపాధ్యాయులు పుష్పలత, బాలాజీ పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని పెద్దతామరపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ విగ్రహానికి ప్రధానోపాధ్యాయులు కె.గున్నయ్య ఉపాధ్యాయులు బాలక శంకరరావు, కుమారి, వనిత పూలమాలు వేసి నివాల్లర్పించారు. నెహ్రూ వేషధారణతో చిన్నారులు సుశాంత్, జయవర్ధన్‌లు ఆకట్టుకున్నారు.


మాట్లాడుతున్న సిఐ నాగరాజు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబందనలు పాటించడమే కాకుండా భద్రతా ప్రమాణాలు, నైతిక విలువలు కలిగి ఉండాలని సిఐ వానపల్లి నాగరాజు సూచించారు. గురువారం నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఆటో డ్రైవర్లతో ఆయన మాట్లాడారు. శుక్రవారం నగరంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతా ప్రమాణాలు, ఆటోలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆటోలో ప్రయాణించే ప్రతి ప్రయాణీకుల రక్షణ బాధ్యత డ్రైవర్లపై ఉంటుందన్నారు. రోడ్లపై ఎక్కడికక్కడ ఆటోలు నిలపడం వల్ల తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కిం చవద్దని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే అపరాధ రుసుం విధించడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ట్రాఫిక్ సిబ్బంది దుర్గారావు, దివిలి హేమ చంద్ర, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జగన్మోహనరావు

ప్రథమ చికిత్సతో ప్రాణాలకు రక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రమాద స్థితిలో ఉన్నప్పుడు ప్రథమ చికిత్స ఎంతగానో ఉపయోగ పడుతుందని, తద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడేందుకు వీలుంటుందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి జగన్మోహనరావు అన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన ప్రథమ చికిత్సపై అందిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతుల్లో ప్రముఖ సుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ కెల్లి చినబాబు హాజరై రెడ్‌క్రాస్ వ్యస్థాపకులు హెన్రీ డ్యూనాట్ చిత్రపటానికి అంజలి ఘటించారు. జిల్లా వ్యాప్తంగా 30 మందిని ఈ శిక్షణకు ఎంపిక చేశారు. ఈ శిక్షణలో భాగంగా సిపిఆర్‌పై అవగాహన, విపత్తుల సమయాల్లో గాయాలకు కట్లు కట్టుట, పాముకాటు, తేలుకాటు, గుండెపోటు, విద్యుత్‌షాక్, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన సమయాల్లో అందించాల్సిన ప్రథమ చికిత్సపై శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, ఎఒ నర్సింగరావు, మేనేజర్ గుణకరరావు, సభ్యులు డా. నిక్కు అప్పన్న, బి.చిన్మయరావు, పి. చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కిష్టుపురం రైల్వే అండర్ పాసేజ్

రేపట్నుంచి అండర్ పాసేజ్‌లో రాకపోకల బంద్

ప్రజాశక్తి- పలాస

మండలంలోని కిష్టుపురం రైల్వే అండర్ పాసేజ్ వద్ద ఈ నెల 16 నుంచి 25 వరకు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో రాకపోకలను నిలిపి వేస్తున్నామని నౌపడ రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే అండర్ పాసేజ్ వద్ద రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైంది. ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, భారీ వాహనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీని దృష్ట్యా పది రోజులు పాటు మరమ్మతులు పనులు చేపట్టనున్నారు. దీంతో రాకపోకలకు నిలిపి వేస్తున్నారు. ఈ విషయాన్ని వాహనదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

రణస్థలం: మండల కేంద్రంలోని కళ్యాణి కంటి ఆస్పత్రి ఆవరణలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. నేత్ర రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి 14 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా కళ్యాణి కంటి ఆస్పత్రి పారామెడికల్ ఆప్తాలమిక్ అధికారి ఎస్.కల్యాణి మాట్లాడుతూ ఇంద్రియాలు అన్నింటిలో కన్ను ప్రధానమైదని. మనకి చూపును ప్రసాదించే కళ్లను సంరక్షించుకోవడం మన బాధ్యతన్నారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ప్రతినిధి సోమేష్ పాల్గొన్నారు.


రోగులను బస్సులో తరలిస్తున్న సిబ్బంది

మధుమేహంపై అప్రమత్తత అవసరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

డయాబెటిస్ ప్రాణాంతకం కాదని, ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా ఈ వ్యాధిని నియంత్రణలో ఉంచవచ్చునని నగర కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి. ప్రసాదరావు అన్నారు. నగరంలోని రైతుబజారు జంక్షన్‌లో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ మారుతున్న జీవన శైలిలో అనేక వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. అందులో బిపి, మధుమేహం ప్రతి ఇంట్లో ఒకరికి తప్పకుండా వస్తుందని చెప్పారు. ఫాస్ట్ ఫుడ్‌లు విచ్చిలవిడిగా పెరిగిపోవడంతో ఏమి తినాలో, ఏమి తినకూడదో తెలియని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. గతంలో 50- 60 ఏళ్ల దాటిన వారికి డయాబెటిక్ వ్యాధి సంక్రమించేదని నేడు 15 నుంచి 20 ఏళ్ల వారిలో ఈ వ్యాధి కన్పించడం విచారకరమన్నారు. శారీరక వ్యాయామం లేకపోవడం, సెల్‌ఫోన్లను అధిక వినియోగించడం వల్ల కూడా అనేక రోగాల భారిన పడుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు హారికా ప్రసాద్, అధ్యక్షుడు లయన్ వావిలపల్లి జగన్నాధ నాయుడు, ఎంజెఎఫ్ చింతాడ కృష్ణమోహన్, జోన్ చైర్మన్ కరణం శోభారాణి, లయన్ డాక్టర్ మెడిశెట్టి సత్య స్వరూప్, కార్యదర్శి మణిశర్మ, ఉపాధ్యాక్షులు తార్లాడ అప్పల నాయుడు, సభ్యులు మజ్జి సుమన్, లక్ష్మణ్, నాయుడు, తరలి, జెఎన్‌టి నాయుడు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు శాసపు జోగినాయుడు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్, గుప్త, రవిశంకర్, దేవీప్రసాద్ లతో పాటు ఇలిసిపురం మెగా యూత్ సభ్యులు అప్పి, వాసు, హారిక కన్‌స్ట్రక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలాస : ప్రపంచ డైయాబెటిస్ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు హనుమంతు యెండు దొర అధ్యక్షతన లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన సాసుమన లోకేశ్వరరావు సౌజన్యంతో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మెగా వైద్య శిబిరంలో ఉచిత షుగర్ వ్యాధి నిర్ధారిత పరీక్షలు సుమారుగా, 96 మందికి బిపి, సుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ తమ్మినాన మాధవరావు, ట్రెజరర్ నెమలిపురి అప్పారావు, డాక్టర్ టి.కృష్ణమూర్తి, నంబళ్ల కోదండరామయ్య, బామ్మిడి నాగేశ్వరరావు, కె.పి.రామన్న, కె.శ్యాంప్రసాద్, ఆర్.దుర్యోధన, ఆర్.సుందరరావు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులు మంచి ప్రవర్తన కలిగి స్నేహపూర్వకంగా మెలగాలని, చట్ట విరుద్ధమైన ర్యాగింగ్ జోలికి పోవద్దని సిఐ టి.త్రినేత్ర సూచించారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. మహిళా సర్కిల్ పోలీస్ స్టేషన్, కళాశాల ఎన్.ఎస్.ఎస్, యాంటీ ర్యాగింగ్ సెల్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సుకు ప్రిన్సిపాల్ పి.సురేఖ అధ్యక్షత వహించారు. సదస్సులో హాజరైన త్రినేత్ర మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చక్కని నడవడిక అవసరమని, తాత్కాలిక ఆకర్షణకు లోను కాకుండా విద్యాభ్యాసం కొనసాగించాలని సూచించారు. విద్యార్థిని, విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, సోదర భావాన్ని అలవర్చుకుని ఉన్నత చదువులు సాగించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, ఐక్యూఎపి కో-ఆర్డినేటర్ ఆర్.హరిత, యాంటీ ర్యాగింగ్ ఇన్‌ఛార్జి డి.రవీంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్ పాత్రో, చలమయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళి విలేకరి గలగాపు వెంకటరమణ భార్య ఝాన్సీ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు వెంకటరమణను పరామర్శించి తమ సంతాపాన్ని తెలియజేశారు. ముందుగా ఝాన్సీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పలాస పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు పైల చిట్టిబాబు, వైసిపి మండల పార్టీ అధికార ప్రతినిధి, ఎంపిటిసి బమ్మిడి దుర్యోధనరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

మందస మండలం హరిపురంలో ఈ నెల 24,25 తేదీల్లో యూటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్ తెలిపారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి, ఉద్యమ నాయకులు,ఉమ్మడి రాష్ట్రంలో యుటిఎఫ్ సహాధ్యక్షులుగా పనిచేసిన కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎల్.వి.చలం, కె.రమేష్, జయరాం, చిట్టిబాబు, జి.రమేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ ఉండాలి

ప్రజాశక్తి- లావేరు

విద్యార్థులు చదువుతో పాటు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని బుడుమూరు జెడ్‌పి పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు పూజారి గోవిందరావు అన్నారు. గురువారం పాఠశాలలో రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్యసేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్య సమాచారం తెలుసుకొని అవసరం మేరకు పోషకాలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ జి. భారతి, హెల్త్ అసిస్టెంట్ ఆర్. శ్యాం సుందర్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

దార్శనికుడు జవహర్‌లాల్ నెహ్రూ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వాతంత్ర్య పోరాటంలో తమ కుటుంబం ప్రత్యక్షంగా పాల్గోవడంతో పాటు యావదాస్తిని దేశం కోసం సమర్పించిన త్యాగనిరతి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సొంతమని వక్తలు పేర్కొన్నారు. నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల సంఘ సంస్కర్తల స్మృతి వనంలో నెహ్రూ విగ్రహానికి లోలుగు మథన్మోహన్, వావిలపల్లి జగన్నాథం నాయుడు, హారికా ప్రసాద్, సురంగి మోహనరావు, మేడూరి ప్రసాదరావు, జామి బీమ శంకరరావు, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ తదితరులు పూలమాలలు వేశారు.

ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో

నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో నెహ్రూ జయంతిని నిర్వహించారు. డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణరావు నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కెవిఎల్ఎస్ ఈశ్వరి, పార్టీ నాయకులు ఆబోతుల వెంకట నాయుడు, ఇజ్జురోతు రమణ, మజ్జి మురళీమోహన్, దంత త్రినాధరావు, అంబటి లక్ష్మణరావు గుంటబారిక అప్పారావు, సాయి, బేరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్వయం సమృద్ధి పంచాయతీలుగా తీర్చిదిద్దాలి



సోంపేట : మాట్లాడుతున్న ఎంపిపి దాసు

ప్రజాశక్తి- సోంపేట

ప్రతి పంచాయతీ స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా పేదరికం లేని పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపిపి డాక్టర్ దాసు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెరుగైన జీవన ఉపాధి, పరిశుభ్రత, పచ్చదనం, మౌలిక వసతులు సామాజిక న్యాయం, భద్రత కలిగిన పంచాయతీలుగా తీర్చిదిద్దాలని సూచించారు. అందుకు ఇటువంటి శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఈశ్వరమ్మ, ఇఒపిఆర్‌డి వెంకటేశ్వర్లు, ఎఒ భాస్కరరావు, వైస్ ఎంపిపి శ్రీను, గణపతి పాల్గొన్నారు.

పలాస : పంచాయితీలను అభివృద్ధి చేయడంతో పాటు ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని ఎంపిపి ఉంగ ప్రవీణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు, కార్యదర్శులకు గ్రామ పంచాయతీ అభివృద్ధిపై శిక్షణా తరగతులు నిర్వహించారు. సమావేశంలో ఎంపిడిఒ వసంత కుమార్, మండల పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.

కవిటి: పల్లెలు ప్రగతికి పట్టుకొమ్మలని, వాటి అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు రావాలని ఎంపిపి కడియాల పద్మ అన్నారు. పంచాయతీల అభివృద్ధిపై మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులు నిర్వహించిన పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక జిపిడిపి శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

నందిగాం : మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి ఎం.రామ్మూర్తి అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి పథకం శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ టి.రాజారావు, మండల ఉపాధ్యక్షులు ఎస్.వసంతరావు ఆర్.లక్ష్మీకాంతం, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్తూరు : పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు వేసుకోవాలని ఎంపిడిఒ నీరజ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు పంచాయతీ అభివృద్ధికి శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఎఒ బసవ రాంబాబు, ఇఒపిఆర్‌డి వసంతకుమారి పాల్గొన్నారు.

బూర్జ: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు కృషి చేయాలని ఎంపిపి కర్నెన దీప అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు నిర్వహించిన శిక్షణ తరగతుల కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. నిధులు సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎంపిడిఒ తిరుపతిరావు, ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, ఎపిఎం బాబురావు, ఎపిఒ రాజ్‌కుమార్, కార్యదర్శి కిరణ్ కుమార్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


బూర్జ : మాట్లాడుతున్న ఎంపిపి దీప


క్రికెట్ ఆడుతున్న చిన్నారులు

బాలల క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి చిత్తశుద్ధితో బాటలు వేస్తున్నామని క్రికెట్ అసోసియేషన్ మెంటార్ ఇలియాస్ అహ్మద్ చెప్పారు. శుక్రవారం నగరంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-12 బాల బాలికల ఎంపికలు చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున క్రికెట్ క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అంపోలు గ్రామంలో ఏడు ఎకరాల స్థలంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించిందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడుల కృషి ఫలితంగా ఈ స్థలం కేటాయింపులు జరుగుతున్నాయని, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మాజీ కేంద్రమంత్రి స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు పేరుతో, మరో ముగ్గురు పెద్దల పేరుతో ప్రతి ఏటా టోర్నమెంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఎంపికలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్‌సి రెడ్డి, కె.కిరణ్, డాక్టర్ ఎస్.రవికుమార్, క్రికెట్ కోచ్‌లు పాల్గొన్నారు.


విద్యార్థినులతో ఉపాధ్యాయులు

హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పొందూరు

ఈనెల 9 నుంచి 11 వరకు కృష్ణాజిల్లా పటమట కెబిసి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-17 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో మండలంలోని పిల్లలవలస జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థినులు ప్రతిభ చూపారు. రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానంలో నిలవగా, ఆ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన పాఠశాలకు చెందిన గురుగుబెల్లి అఖిల, గురుగుబెల్లి సుస్మిత, లట్టి పావనిలు అద్భుతమైన ఆటతీరును కనబరిచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. అద్భుత ప్రతిభను కనబరిచిన విద్యార్థినులను, తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ సహాయకులు గురుగుబెల్లి రాజశేఖర్‌లను హెచ్‌ఎం సుగ్గు కాసులబాబు, సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.


రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదాతలు.. ప్రాణ దాతలు

ప్రజాశక్తి- కవిటి

రక్తదాతలు ప్రాణదాతలని విశ్రాంత డిఎస్‌పి, జనసేన నాయకుడు ఎస్.వి.వి.ప్రసాదరావు అన్నారు. మండలంలోని తిప్పనపుట్టుగలో స్పెషల్ గైస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన తిప్పన పృథ్వీ జ్ఞాపకార్థం గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. తల సేమియా పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో 35 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. అదేవిధంగా మెడిక్యూర్ ఆస్పత్రి ఆధ్వర్యాన నిర్వహించిన మెడికల్ క్యాంపులో వంద మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, ఎస్‌జిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని గంగువాడకు చెందిన 9వ తరగతి విద్యార్థి గాయపడింది. విషయం తెలుసుకున్న స్థానిక పవనపుత్ర సేవా సంస్థ సభ్యులు విశాఖలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలికి గురువారం రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బలగ వైకుంఠరావు, గీత అలేఖ్య, పైల గోపి, ఎం.సాయి పాల్గొన్నారు.